ప్రజాశక్తి
శుక్రవారం 5 ఏప్రిల్ 2024
5
పార్వతీపురం మన్యం

10న జాబ్ మేళా

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఈ నెల 10న భద్రగిరి ఆర్ఐటిఐ ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లమో పాసైన విద్యార్థులు జాబ్‌మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. మల్టీ నేషనల్ కంపెనీలో 270 ఉద్యోగాల కోసం ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఫొటోస్, సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాల కోసం 7981308986, 6304086821 నంబర్లను సంప్రదించాలని కోరారు. జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాక్సైట్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న సిపిఎం నాయకులు, గిరిజనులు

గిరిజన ద్రోహులు, గిరిజన పక్షపాతుల మధ్య పోరాటాన్ని తలపించే విధంగా అరకు ఎమ్‌పి ఎన్నిక కనిపిస్తోంది. 50 శాతంపైగా గిరిజనులున్న పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఆరు ఎస్‌టి అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక ఎస్‌సి రిజర్వుడు నియోజకవర్గం ఉన్నాయి. అరకు పార్లమెంటు నియోజకవర్గం ఏర్పడిన తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఒకసారి, వైసిపి అభ్యర్థులు రెండుసార్లు విజేతలుగా నిలిచారు. గిరిజనుల ఓట్లతో విజయం సాధించిన ఎమ్‌పిలైన నాయకులు ఒడ్డు దాటిన తర్వాత ఓడ మల్లయ్య చందంగా తయారైన పరిస్థితి ఏర్పడింది. మరోసారి అరకు ఎమ్‌పి బరిలో నిలిచిన అభ్యర్థులు, వారి పార్టీల నేపథ్యం పరిశీలిస్తే...

గిరిజన ద్రోహులు X పక్షపాతులు మధ్యే పోరు

తేడాని గమనించకపోతే నష్టపోయేది ఆదివాసీలే

ప్రజాశక్తి-సాలూరు

గిరిజన చట్టాలు, హక్కుల పరిరక్షణలో ఇప్పుడు పోటీలో ఉన్న వైసిపి, టిడిపి కూటమి వైఖరులు ఒకే విధంగా ఉన్నాయనడంలో సందేహం లేదు. జిఒ నెంబర్ 3, అటవీ హక్కుల చట్టం, బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చడం, 1/70 చట్టం అమలు, షెడ్యూల్‌లో లేని గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో విలీనం చేయడం వంటి అంశాలలో అనేక సంవత్సరాలుగా పాలక పార్టీలు దోబూచులాట ఆడుతున్నాయి. బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలంటూ మొదట టిడిపి ప్రభుత్వం ప్రతిపాదించగా, తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం కూడా అదే బాటలో నడిచింది. దీనిపై వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించడంపై ఆదివాసీ గిరిజన సంఘం సహా అనేక సంఘాలు భగ్గుమన్నాయి. అధికారపార్టీ ఎమ్మెల్యేలను నిలదీశాయి. అరకు పార్లమెంటు పరిధిలో ఆరుగురు వైసిపి ఎమ్మెల్యేలు ఉండగా ఒక్కరూ ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకించలేదు. కనీసం వారి స్పందన తెలియజేయలేదు. ఏజెన్సీలో గిరిజనులకు వందశాతం ఉద్యోగాలకు సంబంధించిన జిఒ నెంబర్ 3 రద్దు విషయంలోనూ వైసిపి ప్రభుత్వం మొక్కుబడిగా స్పందించింది. కానీ చిత్తశుద్ధితో దానిపై పోరాడలేదు. 1/70 చట్టం అమలు విషయంలో అటు టిడిపి, ఇటు వైసిపి ప్రభుత్వాలు రెండూ కప్పదాటు వైఖరి అవలంభిస్తున్నాయి. ఈ చట్టాన్ని అడుగడుగునా ఉల్లంఘిస్తుండడంతో షెడ్యూల్ ఏరియాలో గిరిజనేతరుల ప్రాబల్యం పెరిగిపోతూ వస్తోంది. దీనివల్ల గిరిజనుల భూములు అన్యాక్రాంతమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. షెడ్యూల్లో లేని గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో విలీనం చేయాలని గత కొన్ని సంవత్సరాలుగా గిరిజనులు పోరాడుతున్నా ప్రస్తుత పాలకపార్టీలు పట్టించుకున్న దాఖలాలు లేవు.

దొందూ దొందే

రాష్ట్రంలో ఉన్న అధికార, ప్రతిపక్ష పార్టీల వైఖరి గిరిజన చట్టాలు, హక్కుల పరిరక్షణ విషయంలో ఒకే విధంగా ఉంది. కేంద్రంలో గడిచిన పదేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి మొదటి నుంచి గిరిజన చట్టాల్ని నిర్వీర్యం చేసే విధానాలను అవలంబిస్తోంది. మరోవైపు గిరిజన చట్టాలు హక్కుల పరిరక్షణ విషయంలో జనసేన లాంటి పార్టీకి ఒక విధానమంటూ లేదని స్పష్టంగా తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో జరుగుతున్న అరకు ఎమ్‌పి ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా డాక్టర్ తనూజా రాణి, టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా కొత్తపల్లి గీత పోటీ చేస్తున్నారు. వైసిపి అభ్యర్థి తనూజా రాణి.. అరకు సిట్టింగ్ ఎమ్మెల్యే చెట్టి ఫల్గుణ కోడలు. ఎమ్మెల్యేగా చెట్టి ఫల్గుణపై తీవ్రమైన అవినీతి, భూకబ్జా ఆరోపణలు ఉన్నాయి. ఆయన గిరిజనుల భూములే ఆక్రమించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాంటి ఎమ్మెల్యే కుటుంబ వారసురాలిగా రాజకీయాల్లోకి వచ్చిన తనూజా రాణి గిరిజనులకు ఏమేరకు సహకరిస్తారనేది ప్రశ్నార్థకంగా ఉంది.

టిడిపి కూటమి అభ్యర్థి కొత్తపల్లి గీత 2014లో వైసిపి ఎమ్‌పిగా పోటీచేసిన గెలిచారు. తర్వాత అప్పుడు అధికారంలో ఉన్న టిడిపి, బిజెపి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించారు. ఆమె గెలిచిన తరువాత ఒక్కసారి కూడా నియోజకవర్గంలో పర్యటించిన దాఖలాలు లేవు. గిరిజన సమస్యలపై పార్లమెంటులో గొంతు వినిపించిన సందర్భం కూడా లేదు. టిడిపి ప్రభుత్వ హయాంలో గిరిజన యూనివర్సిటీని తొలుత పాచిపెంట మండలంలో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఆ సమయంలో ఆమె తన అభిప్రాయాన్ని వ్యక్తం కూడా చేయలేదు. గిరిజన ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన గిరిజన యూనివర్సిటీని మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేసినా ఆమె కిమ్మనలేదు. వీటన్నిటి కన్నా ఆమె గిరిజన నాయకురాలు కాదనే వివాదం నడుస్తోంది. ఎస్‌టి వాల్మీకి తెగకి చెందిన నాయకురాలినని చెప్పుకుంటున్నా వివాదం మాత్రం వెంటాడుతూనే ఉంది. బిజెపి పార్వతీపురం మన్యం జిల్లా నాయకులే ఆమెకి ఎమ్‌పి సీటు ఇవ్వొద్దని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేశారు. పొత్తులో భాగంగా టిడిపి నాయకత్వం అంగీకరించినా స్థానిక టిడిపి నాయకులు చాలామంది ఆమె అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు.

గిరిజనుల పక్షాన సిపిఎం

అరకు ఎమ్‌పి బరిలో సిపిఎం నుంచి గిరిజన నాయకులు అప్పలనర్స ఉన్నారు. ఆయన అరకు, పాడేరు ప్రాంతంలో అనేక గిరిజన ఉద్యమాల్లో పాల్గొన్నారు. గిరిజన చట్టాలు, హక్కుల పరిరక్షణ విషయంలో పోరాటాలు చేశారు. బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఉద్యమం నడిపించారు. గిరిజనులకు ద్రోహం చేసిన రెండు పార్టీల అభ్యర్థులు, గిరిజనుల పక్షాన పోరాడుతున్న సిపిఎం అభ్యర్థి మధ్య అరకు యుద్ధం మొదలైంది. ఈ యుద్ధంలో గిరిజనులు ఎవరి పక్షాన నిలబడతారనేది తేలాల్సి ఉంది.

కోర్టు తీర్పు అనంతరం మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఉపాధ్యాయ సంఘాల నాయకులపై కేసు కొట్టివేత

- 2017లో కలెక్టరేట్ ముట్టడి
- 15 మందిపై కేసు నమోదు
- ఏడేళ్ల విచారణ అనంతరం కోర్టు తీర్పు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

టీచర్ల బదిలీల కౌన్సిలింగ్ విధానంలో లోపాలను సరిచేయాలని డిమాండ్ చేస్తూ 2017 జూన్ 21న జిల్లా కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక (ఫ్యాప్టో) ఆధ్వర్యాన జరిగిన పోరాటం సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులపై పోలీసులు పెట్టిన కేసును ఎట్టకేలకు కోర్టు కొట్టివేసింది. ఆనాడు మాన్యువల్‌గా కౌన్సిలింగ్ నిర్వహించాలని, బదిలీల్లో అశాస్త్రీయమైన పాయింట్ల విధానాన్ని తొలగించాలని తదితర డిమాండ్లపై వేలాది మంది విద్యార్థులు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యాన కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. అప్పట్లో ఈ కార్యక్రమం రాష్ట్రంలోనే చర్చనీయాంశమైంది. ఈనేపథ్యంలో పోలీసులు ఉపాధ్యాయ సంఘాల నాయకులు 15 మందిపై కేసు నమోదు చేశారు. ఉపాధ్యాయ నాయకుల తరుపున ఈ కేసును ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకులు, న్యాయవాది గేదెల సత్యం వాదించారు. సుమారు ఏడేళ్ల పాటు సుదీర్ఘకాలం కేసు విచారణ సాగింది. 18 సాక్షులను న్యాయమూర్తి విచారించిన అనంతరం ఎట్టకేలకు ఈ కేసును కొట్టివేస్తూ సీనియర్ సివిల్ జడ్జి గురువారం తీర్పు చెప్పారు. అప్పట్లో కేసు నమోదైన నాయకుల్లో కె.శేషగిరి, కె.విజయగౌరి, ఎస్.మురళీ మోహన్‌రావు, కె.శ్రీనివాసరావు, కె.గోపాల్ పట్నాయిక్, డి.ఈశ్వరరావు, బి.జోగినాయుడు, జెసి రాజు, ఎ.సదా శివరావు, కె.జోగారావు, ఎ.గౌరీశంకర గణపతిరావు, జె.రామునాయుడు, బి.గోవిందనాయుడు, టి.సన్యాసిరాజు, షేక్ బుకారిబాబు ఉన్నారు. వీరిలో శేషగిరి 2021లో కరోనాతో మరణించిన విషయం తెలిసిందే.

ఇది ఉపాధ్యాయుల విజయం

కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులపై పోలీసులు పెట్టిన కేసును కొట్టివేయడం ఉపాధ్యాయుల విజయమని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, ఎస్.మురళీ మోహనరావు తెలిపారు. కేసులో ఉపాధ్యాయ ఉద్యమమే విజయం సాధించిందని పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా సాగిన ఈ కేసులో సమయం, సెలవులు అన్నింటినీ నాయకత్వం ఎదుర్కొందని తెలిపారు. కేసులకు,జైళ్లకు భయపడే పరిస్థితి లేదన్నారు. పోరాటాలు ఎప్పుడూ విజయం సాధిస్తాయని అన్నారు.

ఉపాధి కల్పనలో ఫస్ట్

- 1.18 లక్షల పనిదినాలు
- రూ.502.27 కోట్ల మేర చెల్లింపులు

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం అమల్లో విజయనగరం జిల్లా రాష్ట్రంలో మరోసారి మొదటి స్థానంలో నిలిచింది. గత ఆర్థిక సంవత్సరం (2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ వరకు)లో జిల్లాలో 2.10లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా 1.18లక్షల పనిదినాలు కల్పించారు. రాష్ట్రంలో అతి ఎక్కువ పనిదినాలు కల్పించినట్టుగా జిల్లా రికార్డుకెక్కింది. వామపక్షాల ఒత్తిడితో 2005లో అప్పటి యుపిఎ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని రూపొందించిన విషయం విధితమే. దీని అమలులో విజయనగరం జిల్లా ముందంజలో ఉంటోంది. జిల్లాలో వలసల నివారణకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఈ పథకం ఆలంబనగా నిలుస్తోంది. జిల్లాలో ప్రస్తుతం సుమారు 3,82,000 జాబ్‌కార్డులు ఉండగా, 3.21లక్షల కార్డులపై 5.04లక్షల కూలీలు పనిలోకి వెళ్తున్నారు. ఈ ఏడాది చేపట్టిన పనులకు సంబంధించి ఫిబ్రవరి 6 నాటికి జరిగిన పనులగాను రూ.502.27 కోట్ల మేర వేతన చెల్లింపులు జరిగాయి. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 31వ తేదీ వరకు కల్పించిన పని దినాలకు సంబంధించి మరో రూ.60లక్షల వరకు కూలీలకు అందాల్సివుంది. జాబ్ కార్డుదారుల్లో 8,076 మంది వికలాంగులు ఉన్నారు. వీరికి 4,45,400 పనిదినాలు కల్పించారు. ఇందులోనూ రాష్ట్రంలో మొదటి స్థానం లభించడం గమనార్హం. మొత్తం గిరిజన కార్డుదారుల్లో 83.661శాతం మందికి ఉపాధి పనులు దొరికాయి. 65,441 కార్డుదారులు 100రోజుల పనిదినాలు ఉపయోగించుకున్నారు. గత ఏడాది కూడా ఉపాధి కల్పన, ఎస్సీ, ఎస్టీల పనిదినాలు కల్పించడం వంటి అంశాల్లో విజయనగరం మొదటి స్థానంలో నిలిచింది. అంతకు ముందు జాతీయ అవార్డులు సైతం వచ్చాయి.

ఇందుకు కారణం లేకపోలేదు. విజయనగరం పూర్తిగా వ్యవసాయాధారమైన జిల్లా. సారవంతమైన భూములు ఉన్నప్పటికీ పాలకులు సాగునీటి వనరులు కల్పించలేదు. పారిశ్రామికాభివృద్ధి లేదు. దీంతో, ఏటేటా వలసలు పెరుగుతుండేవి. ఈ పథకం అమల్లోకి వచ్చాక క్రమంగా తగ్గాయి. జ్యూట్ మిల్లులు మూత, ఒడిదొడుకుల మధ్య నడుస్తున్న ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమల్లో ఉపాధి కోల్పోతున్నవారికి కూడా ఉపాధి పనులే జీవనాధారంగా ఉన్నాయి.

సమిష్టి కృషితో మొదటి స్థానం

పనిదినాల కల్పనలో దేశంలోనే మన జిల్లా మొదటి స్థానం సాధించడం పట్ల చాలా ఆనందంగా ఉంది. సమిష్టి కృషితోనే జిల్లా మొదటి ర్యాంకులో నిలిచింది. ఇందుకు డ్వామా సిబ్బందికి, వేతనదారులు కూడా అభినందనలు. జిల్లా కలెక్టర్ మార్గనిర్దేశం, సిబ్బంది కృషి ముఖ్య కారణం. ఉపాధి పనులపట్ల వేతనదారుల్లో ఉన్న నమ్మకం కూడా దీనికి కారణంగా భావిస్తున్నాం. ఇదే స్ఫూర్తితో మరిన్ని లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తాం.

– ఉమా పరమేశ్వరి,
డ్వామా పీడీ, విజయనగరం

జీడికి ప్రోత్సాహం ఏది?

- నాలుగేళ్లుగా లేని దిగుబడి
- మద్దతుధర లేక నష్టపోతున్న రైతులు

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో జీడి తోట

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గిరిజనుల ప్రధాన జీవనాధారమైన జీడి పంటకు ఐటిడిఎ, జిసిసి అధికారుల నుంచి కొనుగోలుకు ప్రోత్సాహం లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. మన్యం జిల్లాలో అధిక శాతం మంది గిరిజనులు జీడి పంటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గత నాలుగేళ్లుగా కారుమబ్బులు, పొగ మంచు కారణంగా జీడి పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. పంట దిగబడి తగ్గడంతో రైతులు తీవ్ర నిరాశతో ఉన్నారు. జీడి పంట కొనుగోలు చేసేందుకు అధికారులు ముందుకు రాకపోవడంతో మద్దతు ధర లేకుండా పోతుంది. దీంతో తక్కువ ధరకే వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తుంది.

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో సుమారు 50 వేల ఎకరాల్లో జీడి పంట సాగులో ఉంది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోనే 35 వేల ఎకరాల్లో జీడి తోటలు ఉన్నాయి. ఏటా సుమారు 10 వేల క్వింటాళ్ల జీడి పంట దిగుబడి వస్తోంది. దీనిని బట్టి చూస్తే గిరిజన రైతులు జీడి పంటపై ఎంత మేర ఆధారపడి ఉన్నారో అర్థమవుతుంది. పుష్కలమైన జీడి తోటలు ఉన్నప్పటికీ మద్దతుధర లభించకపోవడంతో ఆర్థికంగా అభివృద్ధి చెందలేకపోతున్నారు.

గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ప్రతి ఏడాది జీడి పంట వ్యాపారం కోట్లాది రూపాయల్లో జరుగుతున్నా జిసిసి, ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలుపై దృష్టిసారించడం లేదు. దీంతో దళారుల బెడద ఎక్కువ కావడంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. మరోవైపు ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండిపడుతోంది. చింతపండుతో పాటు జీడి పంటని కూడా గతంలో జిసిసి అధికారులు కొనుగోలు చేసేవారు. అయితే సంస్థకు నష్టాలు వచ్చాయని కొనుగోలు నిలిపివేశారు. దీంతో చేసేది లేక అప్పటి నుంచి గిరిజనులు జీడి పంటను వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుంది.

మూలనపడ్డ జీడి ప్రాసెసింగ్ యూనిట్లు

గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభానికి నోచుకోకుండానే మూలనపడ్డాయి. గిరిజనులు సేకరించిన జీడి పిక్కలను ప్రాసెసింగ్ చేసేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి పరికరాలను కొనుగోలు చేశారు. ప్రాసెసింగ్ విధానంపై కొంతమంది గిరిజన యువత, మహిళలకు శిక్షణ కూడా అందించారు. వీటికి రూపకల్పన చేసిన అప్పటి ఐటిడిఎ పిఒ సువర్ణపండ దాస్ బదిలీపై వెళ్లడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది.

జీడి ప్రాసెసింగ్ యూనిట్

తీవ్రంగా నష్టపోతున్నారు

జీడి పంట పూత సమయంలో తేనెమంచు ఎక్కువగా కురవడంతో గత నాలుగేళ్ల నుంచి దిగుబడి తగ్గింది. దీంతో గిరిజన రైతులు తీవ్ర నష్టాన్ని చవి చూడాల్సి వస్తోంది. వేలాది మంది గిరిజన రైతులు జీడి పంటను నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. అధికారులు గుర్తించి రైతులకు సబ్సిడీపై క్రిమిసంహారక మందులు పంపిణీ చేయాలి.

– మండంగి రమణ,
ఎంపిటిసి, చెముదుగూడ

నష్టపరిహారం ఇవ్వాలి

గతేడాది పంట నష్టపోయిన జీడి రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలి. మూతపడిన జీడి ప్రాసెసింగ్ యూనిట్లు తెరిచి గిరిజనులకు ఉపాధి కల్పించాలి. వ్యవసాయ యాజమాన్య పద్ధతుల్లో జీడి పంటలపై అవగాహన కల్పించాలి.

– కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు

నాయనమ్మకు ప్రేమతో..

వినూత్న ఆలోచనతో వాహనం తయారుచేసిన మనుమడు

సొంతంగా తయారు చేసిన ట్రాలీలో నాయనమ్మను తిప్పుతున్న మనుమడు శివ

ప్రజాశక్తి - కురుపాం

గిరిశిఖర గ్రామానికి చెందిన యువకుడికి వచ్చిన వినూత్న ఆలోచన వృద్ధాప్యంలో ఉన్న నాయనమ్మకు ఎలాంటి పరేషాన్ లేకుండా చేసింది. హాయిగా పనులు పూర్తి చేసుకునే సౌకర్యమైంది. గుమ్మలక్ష్మీపురం మండలంలోని గిరిశిఖరంపై ఉన్న దిగువ చోరుపల్లి గ్రామానికి చెందిన మండంగి చిన్నమ్మి (75) వృద్ధాప్యం కారణంగా కాళ్లు సరిగా వెసులాడక ఏ పని చేసుకోవాలన్నా... ఎక్కడికి వెళ్ళాలన్నా తీవ్ర ఇబ్బందులు పడేది. సమస్య గుర్తించిన మనుమడు మండంగి శివ వినూత్న ఆలోచన చేశాడు. తన ద్విచక్ర వాహనానికి రెండు చక్రాల ట్రాలీ తయారు చేసి అమర్చాడు. తన వద్ద ఉన్న పాత చక్రాలు, కర్రలు, మంచం పట్టితోనే ట్రాలీ తయారు చేసి, పైన దుప్పటి కట్టాడు. అందులో నాయనమ్మ చిన్నమ్మిని కూర్చోబెట్టి అవసరమైన చోటుకు సునాయాసంగా తరలిస్తున్నాడు. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పనులు పూర్తి చేయిస్తున్నాడు. గురువారం కురుపాంలోని ఎపిజివిబి బ్రాంచ్‌కు అదే వాహనంలో చిన్నమ్మిని శివ తీసుకురాగా 'ప్రజాశక్తి' కంట పడింది. వినూత్నంగా ఉన్న వాహనం చూసి వివరాలు ఆరాతీస్తే అసలు విషయం తెలిసింది. నాయనమ్మపై ఉన్న అభిమానం తనలో ఆలోచనకు బీజం పడేలా చేసిందని శివ తెలిపాడు. ఎంతదూరమైనా, కొండలపైనా ఇబ్బందులు లేకుండా ప్రయాణం చేయగలుగుతున్నామని చెప్పాడు.

ప్రమాదకరంగా కల్వర్టు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద కల్వర్టుపై పలకులు పగిలిపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి మీదుగా ప్రతిరోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పొరపాటున గుర్తించకపోతే ప్రమాదం బారిన పడే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ప్రమాదాలు జరగకముందే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాత బస్టాండ్ రహదారిలో కల్వర్టుపై పగిలిన పలకలు

పింఛను కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు

పింఛన్ల కోసం నిరీక్షణ

ప్రజాశక్తి-వీరఘట్టం

మేజర్ పంచాయతీ పరిధిలోని నాలుగు సచివాలయాలకు చెందిన పింఛనుదారులు గురువారం పింఛన్ల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. గురువారం ఉదయమే మేజర్ పంచాయతీ వద్దకు పింఛనుదారులు చేరుకొన్నారు. కార్యాలయ సిబ్బంది 10 గంటల సమయంలో వచ్చి, ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు.

92 శాతం పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపల్ పరిధిలో 30 వార్డులో రెండు రోజులలో 92 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు కమిషనర్ కె.శ్రీనివాస్ తెలిపారు. గురువారం పలు వార్డులలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కమిషనర్ మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ వార్డ్ సచివాలయాల కార్యదర్శులతో మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పింఛన్లు అందజేయాలని సూచించారు. లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

శంకర్రావు కుమార్తెకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మేమున్నాం మీకు అండగా..

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని బిసి కాలనీకి చెందిన దవలవలస శంకర్రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శంకర్రావుతో చదివిన తోటి 1997 పూర్వ విద్యార్థులు ఆ కుటుంబానికి మేమున్నాం అండగా అంటూ భరోసాఇచ్చారు. పూర్వ విద్యార్థులంతా లక్ష రూపాయలు వరకు పోగుచేశారు. శంకరరావు కుమార్తెకి రూ.50 వేల నగదుతోపాటు మరో రూ.50 వేల బాండును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల అనిల్, తూముల మధు, బి.శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులకు పాఠశాల, కళాశాలల స్థాయి నుంచి భూసార పరీక్షలపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వ్యవసాయ శాఖ ఎడి ఆర్.శ్రీనివాస్, జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ పి.షణ్ముఖరాజు అన్నారు. గురువారం గుమ్మలక్ష్మీపురంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు భూసార ఆరోగ్య పరీక్షలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పొలాలకు భూసారం సక్రమంగా సమతుల్యంగా అందిస్తే పంటలు అధిక రాబడి ఇస్తాయన్నారు. నాణ్యమైన పంటల దిగుబడికి భూసార పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. భూమి సారవంతంగా ఉంటే అందులో వేసిన పంటలు మానవాళికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ మేరకు ప్రతి విద్యార్థి కూడా భూసార పరీక్షలపై అవగాహన పెంచుకొని తల్లిదండ్రులకు, రైతులకు భూసార పరీక్షలపై అవగాహన పెంచేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం భూసార శాస్త్రవేత్త డాక్టర్ పి. స్రవంతి, ప్రిన్సిపల్ పెంటన్న, ఎఒ సి హెచ్.ప్రసాద్, వ్యవసాయ శాఖ సహాయకులు భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

ఓటు హక్కు వజ్రాయుధమని, దాని విలువ గురించి ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తహశీల్దార్ పి.రామారావు కోరారు. గురువారం గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేట పంచాయతీ, సవరకోటపాడు గ్రామంలో ఓటు హక్కు వినియోగం, దాని విలువపై అవగాహన కల్పించారు. ప్రతి ఓటరు ఓటును తప్పకుండా వేయాలని, అప్పుడే చక్కనైన ప్రజాస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ఓటు వినియోగించుకోకపోవడం వల్ల ప్రజాస్వామ్య విలువలను కోల్పోతామని అన్నారు. ఎటువంటి ప్రలోభాలకు పాల్పడకుండా ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన, విలువలు కలిగిన వ్యక్తులకు అమూల్యమైన ఓటును వేయాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర, బిఎల్ఒలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలో కృష్ణపల్లిలో గురువారం తహశీల్దార్ కె.ఆనందరావు ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలు లొంగవద్దని కోరారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ పువ్వల సురేష్, ఆరే రామకృష్ణ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో కలశాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

కైలాసనాథ యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఉమా సహిత కైలాసనాథ ఆలయ వార్షికోత్సవ యాత్ర సంబరాలు గుమ్మలక్ష్మీపురంలో గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఉదయం వేళ పూజా కార్యక్రమాలు, సాయంత్రం మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. మహిళల కోలాటం ఆకట్టుకుంది. యాత్రికులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు సర్పంచి బొత్తాడ గౌరీశంకర్రావు, కమిటీ సభ్యులు తెలిపారు. జెయింట్ వీల్, డ్రాగన్ ట్రైన్, బ్రేక్ డాన్స్, బైక్ రైడింగ్ వంటి ఎన్నో వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బంగారమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

బెలగాంలో బంగారమ్మతల్లి ఆలయ ప్రతిష్ట గురువారం వైభవంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే అలజంగి జోగారావు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయ్‌చంద్ర అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఏడుగురు వాలంటీర్ల రాజీనామా

వీరఘట్టం : మండలంలోని చిదిమి గ్రామానికి చెందిన ఏడుగురు వాలంటీర్లు గురువారం రాజీనామా చేశారు.

గిరిజనం.. సమస్యలతో సతమతం

- రోడ్డు సౌకర్యం లేక అవస్థలు
- గెడ్డనీరే ఆధారం
- పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి - కురుపాం

అభివృద్ధికి ఆమడ దూరంలో గిరిజన గ్రామాలు మగ్గుతున్నాయి. సదుపాయాలు అందని ద్రాక్షగా మిగిలాయి. మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయల విధులు వెచ్చిస్తున్నట్లు ప్రభుత్వం మాటలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి తప్ప అభివృద్ధికి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.

తులసి గ్రామానికి వెళ్లే రహదారి

కురుపాం మండలంలో తిత్తిరి పంచాయతీలో గిరిశిఖర గ్రామాలైనా తులసి, పెదతులసి, చినతులసి, గుండం తదితర గ్రామాల్లో సుమారు 300 కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామాలకు రోడ్డు. తాగునీటి, గృహాలు వంటి కనీస మౌలిక సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కనీస రోడ్డు సౌకర్యం లేక కొండకోనల నుంచి సుమారు 10 కిలోమీటర్ల దూరం కాలినడకన గిరిజనులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. అనారోగ్యం బారిన పడినప్పుడు రోగులు, గర్భిణులను డోలీ సహాయంతో గిరిశిఖరాల నుంచి కిందకు దించి ఆటోల ద్వారా వైద్యం కోసం ఆసుపత్రికి తరలిస్తున్నారు. ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక పోవడంతో నిత్యావసర సరుకులను భుజంపై మోసుకుంటూ దట్టమైన అటవీ ప్రాంతం కొండ కోనల్లో నడుచుకుంటూ వెళ్తున్నారు. ఏనుగులు ఈ ప్రాంతంలో తిరుగుతుండడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గ్రామాలకు వెళ్తున్నారు. అటవీ ప్రాంతం గుండా రాకపోకలు చేస్తుంచటంతో ఏ సమయంలో అడవి జంతువులు దాడి చేస్తాయోనని భయంతో రాకపోకలు సాగిస్తున్నారు. తాగునీటి సౌకర్యం లేక గిరిజనులు కలుషితమైన ఊటగడ్డ నీటిని తాగుతున్నారు.

వసతులు లేక ఇబ్బందులు

గృహాలు, తాగునీరు వంటి కనీస సౌకర్యాలకు నోచక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంత మంది అధికారులు వచ్చి చూసి వెళ్లినా మా సమస్యలు పరిష్కారం కావడం లేదు. గిరిజన గ్రామాలకు రహదారి, తాగునీరు సదుపాయం కల్పించలేకపోతున్నారు.

- బి. కాంతారావు, తులసి గ్రామం

కాలిబాటే దిక్కు

మా గ్రామానికి కనీసం రోడ్డు సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించలేదు. దీంతో మేము అనారోగ్యాలకు గురైనప్పుడు డోలీ మోతలతో వైద్యం కోసం తరలిస్తున్నాం. సరుకులు భుజంపై మోసుకుంటూ అటవీ మార్గం గూడా నడుచుకుంటూ వెళ్తున్నాం. ఏనుగులు ఈ ప్రాంతంలో తిరుగుతుండడం వల్ల ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం.

- ఆరిక సన్యాయి, దిగువ గుండం

ఊట గెడ్డ నుండి నీరు తీసుకెళుతున్న గుండం గ్రామ గిరిజన మహిళల

వేసవి వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వేసవిలో ప్రబలే అనారోగ్య సమస్యలకు గురికాకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు రావు సూచించారు. ఎంఆర్ నగరంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య తనిఖీల వివరాలు, వైద్య పరీక్షలను పరిశీలించారు. అక్కడ ఒఆర్ఎస్ ప్యాకెట్లు లభ్యతను పరిశీలించారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా శరీరం నీటి శాతాన్ని కోల్పోతుందని, తద్వారా కూడా జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో గానీ, ఆరోగ్య కేంద్రాల్లో గానీ జ్వరాలు గుర్తించేటప్పుడు మలేరియా, డెంగీ సంబంధిత జ్వరమా లేదా డీహైడ్రేషన్, వడదెబ్బ, ఇతర కారణాలా? అని వెంటనే నిర్ధారణ చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండతీవ్రత వల్ల శరీరం నీటిశాతాన్ని కోల్పోతుందని, అశ్రద్ధ చేస్తే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ఎండతీవ్రత సమయంలో బయట ఎక్కువ శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదన్నారు. ఎల్లప్పుడూ అందుబాటులో తాగునీరు ఉంచుకోవాలన్నారు. కోల్పోతున్న నీటి శాతాన్ని ఎప్పటికప్పుడు నీరు, నిమ్మ రసం, మజ్జిగ, ఒఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, తదితర ద్రావణాలు తీసుకోవడం ద్వారా భర్తీ చేయాలన్నారు. ఎక్కువగా శాఖాహారం తీసుకోవాలని సూచించారు. శరీరాన్ని డీహైడ్రేట్ చేసే టీ, కాఫీ, కార్బోనేటెడ్ కూల్ డ్రింక్స్, నూనె వంటలు, ఎక్కువ కారం, ప్రోటీన్, కొవ్వు కలిగిన ఆహార పదార్థాలు మానుకోవాలన్నారు. వడదెబ్బకు గురయ్యే సమయంలో తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జ్వరం, మత్తు నిద్ర, పాక్షికంగా అపస్మారక స్థితి మొదలగు లక్షణాలు ఉంటాయని చెప్పారు. వెంటనే దగ్గర్లో చల్లని ప్రదేశానికి తీసుకువెళ్ళి, తడి గుడ్డతో శరీరాన్ని రుద్దుతూ ఉండాలని తెలిపారు. స్పృహలో ఉన్నప్పుడు మాత్రమే నీరు, ఇతర ద్రావణాలు తాగించాలని సూచించారు. సాధారణ స్థితికి రాకుంటే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు మరింత జాగ్రత్తలు పాటించాలన్నారు. వేసవి జాగ్రత్తల పట్ల సిబ్బంది ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వి.అనూష, ఆరోగ్య కార్యాలయ డెమో వై.యోగీశ్వరరెడ్డి, సూపర్‌వైజర్స్ సత్తిబాబు, శంకరరావు, వైద్య సిబ్బంది నందిని, పోలమ్మ, బంగారునాయుడు, 104 సిబ్బంది కిరణ్, కోటీశ్వరరావు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంఒ జగన్‌మోహనరావు

సీతంపేటలో ఎమ్మెల్యే కళావతి ప్రచారం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట మండలంలో నాయికమ్మగూడ, పెద్దపొల్ల, దుగ్గి మానాపురం, టిటుకుపాయి పంచాయతీల్లో గురువారం ఎమ్మెల్యే వి.కళావతి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను వివరిస్తూ, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని మళ్లీ ఆదరించాలని ఆమె కోరారు.

కవి సమ్మేళనానికి శ్రీనివాసరావుకు ఆహ్వానం

ప్రజాశక్తి-సాలూరు

ఉగాది సందర్భంగా కవి సమ్మేళనానికి హాజరు కావాలని శ్రీవెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావుకు నెల్లూరుకు చెందిన తెలుగు ప్రాచీన అధ్యయన వేదిక ఆహ్వానించింది. ఆన్‌లైన్ వేదికగా నిర్వహించనున్న ఈ కవి సమ్మేళనానికి హాజరు కావాలని నిర్వాహకులు మాడభూషి సంపత్ కుమార్ ఆయనకు ఆహ్వానం పంపారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కొమరాడ

ఆశా వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. గురువారం మాదలింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశావర్కర్లతో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 7న కార్మిక సంఘ నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, ఆశాలు హాజరుకావాలని కోరారు. సమావేశంలో ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్ఒ విష్ణుచరణ్

ప్రజాశక్తి-సాలూరు

పట్టణ పరిధిలో పెద, చిన దళితవాడల్లో పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సి.విష్ణుచరణ్ గురువారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాలలో ప్రాథమిక మౌలిక వసతులు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సాలూరు పట్టణంలో రహదారులు, భవనాల శాఖ అతిథి గృహాన్ని పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సైతం తనిఖీ చేసి ఏర్పాట్లు, వసతులు పరిశీలించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియకు అవసరమగు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సి-విజిల్, ఆన్‌లైన్ ద్వారా అందే ఫిర్యాదులు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎస్ఎస్‌టి, విఎస్‌టి, వివిటి బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ లు నియమించామని తెలిపారు. సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు ఎన్నికల ప్రక్రియలో ఉన్నారని ఆయన చెప్పారు.

ప్రచారానికి అనుమతులు

ప్రచారానికి ముందస్తు అనుమతి పొందాలని ఆర్ఒ అన్నారు. సువిధా యాప్‌లో కనీసం 48 గంటల ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పెయిడ్ న్యూస్‌ను మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) పర్యవేక్షిస్తుందని చెప్పారు. పెయిడ్ న్యూస్‌గా గమనిస్తే పోటీలో ఉన్న అభ్యర్థి వ్యయ ఖాతాలో ఆ విలువను జమ చేస్తుందని తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియా ప్రకటనలకు విధిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు వేయరాదని అన్నారు. ప్రకటనలకు అనుమతులు పొందుటకు గుర్తింపు పొందిన పార్టీలు కనీసం మూడు రోజుల ముందు, గుర్తింపు లేని పార్టీలు కనీసం వారం రోజుల ముందు ఎంసిఎంసికి దరఖాస్తు చేయాలని సూచించారు. పోలింగ్ రోజున, పోలింగ్ ముందు రోజున ప్రింట్ మీడియాలో ప్రచురించే ప్రకటనలకు అనుమతులు అవసరమని ఆయన స్పష్టంచేశారు. కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లు తదితర సామగ్రిని ముద్రించే వారు, ప్రచురణకర్తలు విధిగా వారి చిరునామా, ముద్రించిన ప్రతులు సంఖ్య ప్రచురించాలని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జనసంచారం తక్కువగా ఉన్న సాలూరు ప్రధాన రహదారి

ఉడికించిన సూరీడు

నిర్మానుష్యంగా మెయిన్‌రోడ్

ప్రజాశక్తి-సాలూరు

వేసవిలో ఎండతీవ్రత అధికమైంది. పగటిపూట ఉష్ణోగ్రత చాలా ఎక్కువగా ఉంది. వడగాల్పులు అధికమై, ఉక్కపోత జనాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మిట్టమధ్యాహ్న సమయంలో సాలూరు పట్టణంలోని మెయిన్ రోడ్ నిర్మానుష్యంగా మారింది. పట్టణ ప్రజలు రోడ్లపైకి రావడానికి భయపడే పరిస్థితి నెలకొంది. గడచిన కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మరో వైపు పట్టణంలో ప్రధాన జంక్షన్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. పోస్టాఫీసు ముందు, బోసు బొమ్మ జంక్షన్‌లో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. దీంతో అత్యవసర పనుల మీద పట్టణానికి వచ్చిన గ్రామీణ ప్రజలకు చలివేంద్రాలు దాహార్తిని తీరుస్తున్నాయి.

ఎండల పట్ల జాగ్రత్తలు

వీరఘట్టం : ఎండ తీవ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆశా వర్కర్లను ఆదేశించారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉదయం 11 గంటలకు లోపు, మధ్యాహ్నం నాలుగు గంటల తర్వాత బయటకు రావాలని సూచించారు. ఆశావర్కర్ ఒఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతి కుమారి, కె.జనార్ధన్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో టిడిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలో గొట్టూరు, మూటకూడు పంచాయతీల పరిధిలోని గిరిజన గ్రామాల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి తమకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే గిరిజన గ్రామాల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తానని, ముఖ్యంగా రోడ్లు, తాగునీటి సౌకర్యానికి ప్రాధాన్యత కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు, ముఖి సూర్యనారాయణ, జి.యుగంధర్, దండి మోహన్‌రావు, గొర్ల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి

జోగింపేటలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'



ప్రచారం చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయచంద్ర

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని జోగింపేట గ్రామంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.విజయచంద్ర ఆధ్వర్యాన బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి సూపర్ సిక్స్ పథకాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన ,బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో గిరిజనుడు మృతి

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన బిడ్డిక మహేష్ (30) రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై మృతిచెందాడు. బంధువుల వివాహానికి చిన్నకంబ గ్రామానికి వెళ్లిన మహేష్ తిరిగొస్తుండగా వజ్జయిగూడ గ్రామ జంక్షన్ దగ్గరలో బైక్ అదుపుతప్పి బోల్తా పడ్డాడు. వెంటనే మహేష్‌ను వైద్యం నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతిచెందాడు. బిడ్డిక మహేష్ భార్య బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

1200 లీటర్ల సారా ధ్వంసం

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలో వివిధ కేసుల్లో పట్టుబడిన 1200లీటర్ల నాటుసారా, 180 మద్యం బాటిళ్లను పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. టౌన్ సిఐ సిహెచ్.వాసునాయుడు, టౌన్ ఎస్ఐ కెవి సురేష్, సహా సిబ్బంది ట్రాక్టర్‌తో మట్టించి ధ్వంసం చేశారు.

In the Honourable Court of the 2nd Additional District Judge Parvatipuram
O.S. 05/2022

Between:
Pugaku Murali Krishna ....Plaintiff
And:
Karri Neelakantam and another ....Defendants

To,
D12. Killadi Kiran Kumar S/o Prakasa Rao, D.No. 1-88, Seethamamba puram, Komarada Mandal.

Take notice that the above plaintiff has filed the suit seeking for Specific Performance of properties mentioned in the schedule of the said plaint and the said suit has been posted to **18.04.2024** for your appearance before the above court at **10.30 am.**

Take notice that if you fail to attend the court on the day above mentioned either in person or through an authorized person, the matter will be heard and determined in your absence.

// By order of the Court//

P. Rajeswara Rao
Advocate
PARVATIPURAM

Parvatipuram
Dt.04:04.2024